రాజ్‌భవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో గవర్నర్ రాధాకృష్ణన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు

సుసంపన్న రాష్ట్ర నిర్మాణానికి సంకల్పిద్దాం

- ప్రజలందరికీ ధనం, ఆరోగ్యం, సంతోషాలు చేకూర్చాలని భగవంతుడిని కోరుకుంటున్నా
- ఉగాది వేడుకల్లో గవర్నర్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): వ్యక్తిగత నిబద్ధత, నిరంతర శ్రమ, నిస్వార్థసేవ, పరస్పర సహకారాల ద్వారా ప్రగతిశీల సుసంపన్న తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడానికి సంకల్పిద్దామని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గి అన్ని రంగాల్లో స్వావలంబన సాధించిన భారతదేశంగా నిర్మించుకోడానికి సంకల్పించాలని కోరారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో గవర్నర్ మాట్లాడుతూ.. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ ధనం, ఆరోగ్యం, సంతోషాలు చేకూర్చాలని భగవంతుడిని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఈ క్రోధి నామ సంవత్సరంలో కొంత క్రోధం ఉన్నప్పటికీ, ఇది అందరికీ సానుకూలంగా, శ్రేయోదాయకంగా ఉంటుందని పంచాంగకర్తలు చెప్పడం ముదావహం అని పేర్కొన్నారు. గత సంవత్సరం మనం చేసిన పనులను సమీక్షించుకొని మరింత నిబద్ధత, అంకితభావం, కృషి, ఉన్నతమైన ఆలోచనలు, సేవాభావంతో మన పనితీరును మరింత మెరుగ్గా మలచుకోవాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తి అలోక్ అరాధే, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే రేవంత్ సీఎం అయ్యారు

- కష్టపడితే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం
- గాంధీభవన్‌లో శ్రీనివాస్‌మూర్తి పంచాంగ శ్రవణం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): అందరి సమిష్టి కృషి వల్లనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, మరోసారి కష్టపడితే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీదే విజయమని పంచాంగ శ్రవణంలో వేద పండితుడు శ్రీనివాస్‌మూర్తి పేర్కొన్నారు. ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం గాంధీభవన్‌లో శ్రీనివాస్‌మూర్తి పంచాంగ శ్రవణం చేస్తూ, ప్రజల అభీష్టం మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అద్భుతంగా పాలన సాగిస్తున్నదని, రాబోయే రోజుల్లోనూ మరింత అద్భుతంగా పాలన సాగిస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కష్టపడినవిధంగానే కోపాలకు, ఆవేశాలకు గురికాకుండా కష్టపడి పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక సీట్లు గెలుచుకుంటుందని, ఇది కేంద్రంలో కూడా అధికారంలోకి రావడానికి దోహదపడుతుందని వివరించారు. కొందరు ప్రముఖుల ఆకస్మిక మరణాలు సంభవిస్తాయని, నేరాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ బీ వెంకట్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు కుమార్‌రావు, నిరంజన్, చల్లా నర్సింహారెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ రేస్‌లో ఉంటా: జగ్గారెడ్డి

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, రాకపోయినా రాహుల్‌గాంధీ ప్రతిష్ఠ తగ్గదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేస్తూ, పీసీసీ అధ్యక్షుడిని మార్చితే ఆ రేసులో తన పేరు కచ్చితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజ్యపూజ్యం 16, అవమానం 2 మాత్రమేనని పంచాంగం చెప్తున్నదని తెలిపారు.

కొలువుల హడావుడి.. కాంగ్రెస్ బురిడీ!

30 వేల ఉద్యోగాలు మేమే ఇచ్చామంటూ డ్రామా

ఒక్క నోటిఫికేషన్ లేకుండా ఎలా సాధ్యమని నిలదీత

అన్నింటికీ నోటిఫికేషన్లు ఇచ్చింది కేసీఆర్ సర్కారే

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు

ఇది ఎన్నికల స్టంట్ అంటున్న నిరుద్యోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం.' ఇది స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ పలు వేదికలపై వల్లెవేస్తున్న మాట. ఇది నిజమా.. కాదా.. అన్న విషయం ఆయనకు తెలుసు.. రాష్ట్ర ప్రజలకూ తెలుసు, మరీ ముఖ్యంగా నిరుద్యోగులకు అంతకన్నా బాగా తెలుసు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా వేయలేదు. మరెలా సాధ్యమని నిరుద్యోగులే ప్రభుత్వ పెద్దలను నిలదీస్తున్నారు. సీఎం ఒక్కరే కాదు.. మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం ఇదే విషయాన్ని పదేపదే చెప్తున్నారు. అసలు ఆయా పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు ఎవరు, ఎప్పుడు విడుదల చేశారన్న విషయాన్ని మాత్రం పూర్తిగా మరిచిపోయారు.

వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 వేల ఉద్యోగాలను తామే భర్తీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా నిరుద్యోగులను ప్రసన్నం చేసుకోవడం కోసం ప్రచార ఆర్భాటానికి తెరలేపారని ప్రతిపక్షాల నుంచి విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. గత సీఎం కేసీఆర్ హయాంలో విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన అభ్యర్థులకు భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి, హంగు ఆర్భాటాలతో, హైడ్రామా తలపించేలా సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇచ్చి, నిరుద్యోగుల చెవులో పూలు పెట్టారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానిదే ఘనత

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెందుతుందన్న విషయం ప్రతి ఒక్కరి నిరుద్యోగికీ తెలుసు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి అందుకు సంబంధించిన నోటిఫికేషన్లు ఏ ప్రభుత్వంలో విడుదల అయ్యాయన్న ప్రశ్నలకు మాత్రం ఎక్కడా సమాధానాలు ఇచ్చుకోలేదు. గత ప్రభుత్వంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు మాత్రం కొన్ని పోస్టులను కలుపుతూ మాత్రమే నిర్ణయం తీసుకున్నారు. అందులో స్టాఫ్ నర్సులో 1,890 పోస్టులు, గ్రూప్-1లో 60 పోస్టులను కలిపి హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసింది.

2022లోనే నోటిఫికేషన్ల పరంపర

ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ నియామక దశల్లో ఉన్న నోటిఫికేషన్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విడుదలయ్యాయి. వాటిలో దాదాపు 18 ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1లో 503 పోస్టులు, గ్రూప్-2లో 783 పోస్టులు, గ్రూప్-3లో 1,363తో పాటు 1,392 జూనియర్ లెక్చరర్ పోస్టులతో భారీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. 247 పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దాదాపు 1.540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్స్ (ఏఈఈ) పోస్టుల భర్తీ కోసం 2022 సెప్టెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా నోటిఫికేషన్లు విడుదల చేసిన ప్పటికీ నిరుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ఇతర సాంకేతిక కారణాల వల్ల ఆయా ఉద్యోగాల నియామకప్రక్రియ కొనసాగుతూ వస్తున్నది. ప్రస్తుతం గ్రూప్ పరీక్షల కోసం పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాత పరీక్షలు నిర్వహించడం కోసం టీఎస్‌పీఎస్సీ అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. వాస్తవం ఇలా ఉంటే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ఈ నిజనిజాలనూ ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

నియామక ప్రక్రియలో ఉన్నవి

పోస్టు పేరు	పోస్టుల సంఖ్య	నోటిఫికేషన్ తేదీ	పరీక్ష ఫలితాలు
5 గ్రూప్-1	563	డిసెంబర్ 30, 2022	జూన్ 9, 2024న (స్క్రీనింగ్)
6 గ్రూప్-2	783	డిసెంబర్ 29, 2022	ఆగస్టు, 7, 8
7 గ్రూప్-3	1363	డిసెంబర్ 29, 2022	నవంబర్ 17, 18

2022లోనే విడుదలైన మరికొన్ని నోటిఫికేషన్ల వివరాలు

పోస్టు పేరు	పోస్టుల సంఖ్య	నోటిఫికేషన్ తేదీ
అసిస్టెంట్ ప్రొఫెసర్ (లైబ్రేరియన్)	544	డిసెంబర్ 31, 2022
అకౌంట్స్ ఆఫీసర్	78	డిసెంబర్ 31, 2022
ఏఎంవీఐ	113	డిసెంబర్ 31, 2022
అగ్రికల్చర్ ఆఫీసర్	148	డిసెంబర్ 28, 2022
జూనియర్ లెక్చరర్	1392	డిసెంబర్ 9, 2022
పాలిటెక్నిక్ లెక్చరర్	247	డిసెంబర్ 7, 2022
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	1540	సెప్టెంబర్ 3, 2022

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వివరాలు

	పోస్టు పేరు	పోస్టుల సంఖ్య	నోటిఫికేషన్ తేదీ	పరీక్షలు	ఫలితాల విడుదల
1	గురుకులాలల్లో టీజీటీ, పీజీటీ	9210	ఏప్రిల్ 2023	ఆగస్టు 2023లో	ఫిబ్రవరి 2024
2	పోలీసు శాఖలో కానిస్టేబుల్	17516	ఏప్రిల్ 2022	జూన్ 2023లో	అక్టోబర్ 4, 2023
2	ఎస్ఐ/ఏఎస్ఐ	587	ఏప్రిల్ 2022	ఏప్రిల్ 2023	ఆగస్టు 7, 2023
3	స్టాఫ్ నర్సులు	5204	డిసెంబర్ 2022	ఆగస్టు 2 2023	డిసెంబర్ 23, 2023

మొత్తం పోస్టులు 32,515

106 మంది ఉద్యోగులపై ఈసీ కొరడా

ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించినందుకే..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9: ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగులపై ఈసీ కొరడా ఝుళిపించింది. సోమవారం రాత్రి జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఓ రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్నందుకు సిద్దిపేట జిల్లాకు చెందిన 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసీ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి ఆ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండ్ అయిన 38 మంది సెర్ప్ ఉద్యోగుల్లో.. ఏపీఎంలు 14 మంది, సీసీలు 18 మంది, వీవోఏలు నలుగురు, ఒక సీబీ ఆడిటర్, ఉపాధి హామీ పథకానికి చెందిన 68 మంది ఉద్యోగుల్లో.. ఏపీవోలు నలుగురు, ఈసీలు ఏడుగురు, టీఏలు 38 మంది, సీఈవోలు 18 మంది, ఒక ఎఫ్ఏ ఉన్నారు.

మజ్లిస్, కాంగ్రెస్ మధ్య అవగాహన!

రాష్ట్రవ్యాప్తంగా పరస్పర సహకారం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో కలిసి పని చేయడం తమ విధానమని మజ్లిస్ (ఎంఐఎం) మరోసారి నిరూపించుకున్నది. పదేండ్లపాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా వ్యవహరించిన ఎంఐఎం తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో అనధికార అవగాహన కుదుర్చుకున్నట్టు తెలిసింది. రెండు, మూడు రోజులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నేతలకు, ఎంఐఎం అగ్రనేతలకు మధ్య జరిగిన చర్చలు ఫలించినట్టు కాంగ్రెస్ వర్గాల సమాచారం. ఈ ఒప్పందం మేరకు హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి బలహీనమైన, మైనార్టీయేతర అభ్యర్థిని బరిలోకి దించడానికి కాంగ్రెస్ పెద్దలు అంగీకరించినట్టు ఈ వర్గాల సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టిన మూడు ఎంపీ స్థానాల్లో హైదరాబాద్ ఒకటి. తమ పార్టీ ఖమ్మం, కరీంనగర్ అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టడానికి బలమైన కారణాలే ఉన్నప్పటికీ, హైదరాబాద్ అభ్యర్థిని ప్రకటించకపోవడానికి ఇరుపార్టీల మధ్య కొనసాగుతున్న మంతనాలే కారణమని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ మైనార్టీ నాయకులు షబ్బీర్‌అలీ, అజహరుద్దీన్‌కు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో మొదటి నుంచి పడదు. అయినా, అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరిద్దరూ అసదుద్దీన్ వద్దకు వెళ్లి చర్చలు జరపడం ఇరు పార్టీల్లో చర్చనీయాం శం అయింది. కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతోపాటు పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి లేకుండా షబ్బీర్‌అలీ కానీ, అజహరుద్దీన్ కానీ ఒవైసీ వద్దకు వెళ్లి చర్చలు జరిపే అవకాశమే ఉండదని ఈ వర్గాలు చెప్తున్నాయి. ఇరు పార్టీల మధ్య పరస్పర సహకారం మేరకు కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అవగాహనతో పనిచేస్తామని ఎంఐఎం హామీ ఇచ్చినట్టు సమాచారం.

ముచ్చింతల్‌లో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సూపర్ పవర్‌గా భారత్ ఎదగాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : సూపర్‌పవర్‌గా భారత్ ఎదగాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరుకున్నారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో శ్రీక్రోధినామ ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అమెరికా, ఐరోపా సమాఖ్య, చైనాతో పోటీపడుతూ భారత్ అంతర్జాతీయస్థాయిలో ముందుకు వస్తుందని చెప్పారు. కొత్త సంవత్సరమైన ఉగాది రోజున నూతన సంకల్పంతో సంసిద్ధులు కావాలని అన్నారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పలువురు ట్రస్టు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణలో రాహుల్ ట్యాక్స్!

మొదటిపేజీ తరువాయి...

పాత గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పని రాహుల్‌గాంధీ కొత్త హామీలు ఇచ్చి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే పండరి, జడ్పీటీసీ రాజురాథోడ్ సహా పలువురు నేతలు మంగళవారం బీజేపీలో చేరారు. కిషన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్రలు అవసరం లేదని, ప్రజా మద్దతుతోనే ఓడిస్తామని చెప్పారు. రాష్ట్రంలోను, దేశంలోను కాంగ్రెస్ కచ్చితంగా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ ఇటలీకి వెళ్లిపోవడం ఖాయమని పేర్కొన్నారు. దేశంలో రైల్వేలు బాగుండాలంటే, సైనికశక్తి బాగుండాంటే, ఉగ్రదాడులు జరగకుండా ఉండాలంటే, అవినీతి, కుంభకోణాలు జరగకుండా ఉండాలంటే, దేశ భవిష్యత్తు బాగుండాలంటే బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. వచ్చే 25 ఏండ్లలో అన్ని వర్గాల ప్రజలకు వైద్యం, విద్య అందుబాటులో ఉండేలా, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలిపేలా ప్రధాని మోదీ సుపరిపాలన అందిస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు.

మత విద్వేషిలా కిషన్‌రెడ్డి మాటలు

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం : కాంగ్రెస్ హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి పదవిలో ఉండి మత ఛాందసుడిలా, మత విద్వేషిలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టో హిందూ వ్యతిరేక మ్యానిఫెస్టో అని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జిన్నా రాజ్యాంగం వస్తుందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఆ విషయాన్ని మరిచి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడం ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనని నిరంజన్ పేర్కొన్నారు. బీజేపీకి అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై గౌరవముందా? అనే అనుమానం కలిగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఏ అంశము హిందూ వ్యతిరేకమో, రాజ్యాంగ విరుద్ధమో కిషన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మత పరమైన, భాషాపరమైన మైనారిటీలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మ్యానిఫెస్టోలో పేర్కొంటే బీజేపీకి కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కిషన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని నిరంజన్ పేర్కొన్నారు.

ఇండియా-సౌతాఫ్రికా వ్యాపారబంధం మెరుగు

ఎన్నారై నాగరాజు గుర్రాల

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): దక్షిణాఫ్రికా-ఇండియా దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మెరుగుపర్చేందుకు తమవంతు కృషి చేస్తామని తెలంగాణ ఎన్నారై నాగరాజు గుర్రాల తెలిపారు. దక్షిణాఫ్రికాలోని హెచ్ఈ హైకమిషనర్ ప్రభాత్ కుమార్, హెచ్ఈ కాన్సుల్ జనరల్ మహేశ్ కుమార్‌ను మంగళవారం కలిసే అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశం-దక్షిణాఫ్రికా మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిపారు. ఇరుదేశాల వ్యాపార భవిష్యత్తు సహకారాల కోసం ఈ చర్చలు మరింత ఊతమిస్తాయని తెలిపారు.

బీసీల అణచివేత ఇంకెన్నాళ్లు?

డిమాండ్లపై ప్రధాని మోదీకి ఎంపీ ఆర్ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): బీసీల పట్ల వ్యతిరేక ధోరణిని వీడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సూచించారు. దేశంలోని బీసీలకు 76 ఏండ్లుగా అన్యా యం జరుగుతున్నదని, ఇది ఇంకెన్నాళ్లు కొనసాగుతుందని ప్రశ్నించారు. బీసీ సంఘాల డిమాండ్లను వివరిస్తూ మంగళవారం ఆయన ప్రధాని మోదీకి లేఖ రాశారు. బీసీల అభ్యున్నతి కోసం చేపట్టే చర్యలను బీజేపీ మ్యానిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పన నిమిత్తం ప్రతి బీసీ కుటుంబానికి రూ.20 లక్షల సబ్సిడీ ఇవ్వాలని కోరారు. బీసీ వర్గానికి చెందిన మోదీయే ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే భవిష్యత్తులో బీసీలకు ఏ పార్టీ చేయదని అన్నారు.

ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా పూటకో పేరు!

- ఆ స్థానం కోసం మంత్రుల యత్నాలు
- ఆధిపత్య పోరులో తెరపైకి మూడో వ్యక్తి
- అనూహ్యంగా మండవ పేరు తెరపైకి
- రంజాన్ తర్వాత అభ్యర్థుల ప్రకటన!

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఖమ్మం నుంచి బరిలోకి దింపే అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ ఎటూ తేల్చుకోలేకపోతున్నది. ఎంపీ టికెట్‌ను తమ కుటుంబ సభ్యులకు ఇప్పించుకునేందుకు జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వంటి నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తమ కుటుంబ సభ్యులకు టికెట్ దక్కకపోయినా తమకు అనుకూలంగా ఉన్న వారికి టికెట్ ఇప్పించుకునేందుకు లాబీయింగ్ మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో రోజుకో పేరు వెలుగులోకి వస్తున్నది. తాజాగా మరో పేరు తెరపైకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరు కాంగ్రెస్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆయన పేరు బయటకు రావడం వెనక ఎవరున్నారని పార్టీ నేతలు ఆరా తీస్తున్నారు. స్థానికేతరుడైన ఆయనకు టికెట్ ఎలా ఇస్తారని మెజార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. తుమ్మల వర్గీయులు మాత్రం మండవ అభ్యర్థిత్వంపై సానుకూలంగా ఉండడం గమనార్హం. వారి ద్వారానే మండవ పేరు బయటకు వచ్చినట్టు తెలిసింది. గతంలో ఖమ్మం నుంచి ప్రాతినిధ్యం వహించిన రేణుకాచౌదరి, పీవీ రంగయ్య, నాదెండ్ల భాస్కర్‌రావు కూడా స్థానికులు కాదని గుర్తుచేస్తున్నారు. తుమ్మల వర్గీయులు మండవను వెనకేసుకొస్తుండడంతో ఆయన వెనక మంత్రి ఉన్నారన్న అనుమానాలకు బలం చేకూరుతున్నది. రేవంత్‌రెడ్డి పూర్వాశ్రమంలో మండవ వెంకటేశ్వరరావుకు సన్నిహితుడు కావడంతో ఆయన కూడా పావులు కదిపి ఉండొచ్చన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

రఘురాంరెడ్డి పేరు ఖరారుచేశాక పునరాలోచన

మంత్రుల కుటుంబ సభ్యులకు ఖమ్మం టికెట్ ఇచ్చేది లేదని అధిష్ఠానం తేల్చిచెప్పిన తర్వాత వరంగల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురాంరెడ్డి పేరు దాదాపు ఖాయమైనట్టు తెలిసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రఘురాంరెడ్డి వియ్యంకుడు కావడంతో అధిష్ఠానం ఆ తర్వాత పునరాలోచనలో పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మండవ పేరు తెరపైకి వచ్చినట్టు తెలిసింది. మొదట ఈ టికెట్‌ను తన సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. కాంగ్రెస్‌లో చేరిక సమయంలో తాను సూచించిన వ్యక్తికే ఎంపీ టికెట్ ఇస్తామని మాట ఇచ్చిన విషయాన్ని శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేసినప్పటికీ అధిష్ఠానం వినిపించుకోలేదని సమాచారం.

12న అభ్యర్థుల ప్రకటన

పెండింగ్‌లో ఉన్న ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ నియోజకవర్గాలకు 12న కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నదని సమాచారం. 11న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశమై పెండింగ్‌లో ఉన్న స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలని భావించింది. ఆ రోజున రంజాన్ పండుగ నేపథ్యంలో మరుసటి రోజు సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న మూడు స్థానాల్లో ఒకటైన హైదరాబాద్ విషయంలో ఎంఐఎంతో కుదిరిన లోపాయికారీ ఒప్పందం మేరకు బలహీన అభ్యర్థిని బరిలోకి దించబోతున్నట్టు సమాచారం. కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. కరీంనగర్ నుంచి వెలమ సామాజిక వర్గం నుంచి కాకుండా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని బరిలోకి దించే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

సీనియర్ ఐపీఎస్ రాజీవ్‌రతన్ హఠాన్మరణం

తీవ్రమైన గుండెపోటుతో కన్నుమూత ● మరో ఆరునెలల్లో ఉద్యోగ